# దేశంలో ప్రజాస్వామ్యం, చట్టబద్ధపాలనలు భ్రమలని తేటతెల్లంచేస్తున్న బిజెపి పాలకులు

**భారత** రాజ్యవ్యవస్థ – చట్టబద్ధపాలన, ప్రజాస్వామిక సూత్రాలపై ఆధారపడి నడుస్తున్నట్లుగా పాలకులు పేర్కొంటారు. నాగరీక ఉదారవాద ప్రజాస్వామిక దేశాలన్నింటిలో ప్రభుత్వపాలనయొక్క ప్రాథమిక సూత్రాలలో చట్టబద్ధపాలన అనేది కూడా ఒకటిగా పేర్కొంటారు. అలాగే చట్టబద్ధపాలన మనదేశ రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో ఒక భాగంగా బల్లగుద్ది మరీ చెబుతుంటారు.

గత 7 దశాబ్దాలపైగా కాలంలో దేశంలోని అనేక ప్రాంతాలలో ప్రజల అనుభవాలను గమనిస్తే, దేశంలో చట్టబద్ధపాలన అనేదే కొనసాగటంలేదని, దేశంలోని చట్టాల నిరంకుశత్వమే ప్రజల పాలిట అమలవుతూ వుందని స్పష్టమౌతోంది.

ఉత్తరప్రదేశ్‌లో బిజెపి నాయకత్వంలోని ఆదిత్యనాథ్ ప్రభుత్వ ప్రస్తుత పాలన ఈ వాస్తవికతను స్పష్టంగా కళ్ళకు కట్టినట్టు చూపుతోంది.

ఉత్తరప్రదేశ్‌లో పోలీసులు సాగిస్తున్న ఎన్‌కౌంటర్లు రోజువారీ వ్యవహారంగా మారి పోయాయి. చట్టపరమైన అధికారంతో చట్టబద్ధమైన పోలీసు హింస రాష్ట్రాన్ని ఏలుతోంది. ఉత్తరప్రదేశ్‌లో బిజెపి ప్రభుత్వం 'మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్‌డ్ క్రైమ్ యాక్ట్'(ఎమ్‌సిఓసిఏ) తరహాలో 'ఉత్తరప్రదేశ్ కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్‌డ్ క్రైమ్ బిల్–2017' అనే అణచివేత చట్టాన్ని ముందుకు తేవటమేగాక, దర్యాప్తు అధికారిగా, న్యాయమూర్తిగా రెండు పాత్రలనూ నిర్వహించేందుకు, తక్షణ న్యాయం అందించేందుకు నేరస్తులను హతమార్చమంటూ ఉత్తరప్రదేశ్ పోలీసులను అనుమతించింది. దీనినే చట్టబద్ధ పాలనగా పేర్కొంటున్నారు.

2017 మార్చినుండి ఉత్తరప్రదేశ్‌లో జరిగిన 1200 పైగా పోలీస్ ఎన్‌కౌంటర్లలో 40మందిపైగా మరణించగా, మరో 265మందిపైగా నేరస్తులు గాయాలపాలయ్యారు. ఈ తరహా చట్టాతీత హత్యలన్నీ పోలీసులు ఆత్మరక్షణకై సాగించినవేనని చిత్రిస్తూ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర డిజిపి వాటిని సమర్థిస్తున్నాడు.

అయితే 'నేరస్థుల' కుటుంబాలు మాత్రం తమ వారిని ఇళ్ళనుండి తీసుకెళ్ళి, మరి కొన్నిసార్లు ప్రత్యక్షసాక్షుల సమక్షంలోనే–ఈ 'నేరస్థుల'లో అత్యధికులను తలపైనో, ఛాతీలోనో కాల్చి చంపారని చెబుతూవుండటం, పోలీసు అధినేతల 'స్వీయరక్షణ' వాదనల డొల్లతనం గురించి వెల్లడిచేస్తోంది. హత్య గావించబడిన ఈ 'నేరస్థుల' శరీరాలు చిత్రహింసలకు గురై, ఛిద్రమై వుండటం పోలీసులు వారిని బంధించి, చంపివేశారని తెలియజేస్తోంది. చట్టబద్ధపాలనతో ఏవిధంగానూ పోల్చలేని ఉత్తరప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వ పాలనా తీరుది!

ఈ చర్యలపై రాష్ట్రశాసనసభలో ఎవరైనా ప్రశ్నలు లేవనెత్తితే, 'నేరస్థులపట్ల సానుభూతి చూపడం, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమ'ని చెపుతూ చాలా మామూలుగా ఈ అంశాన్ని చర్చించ నిరాకరిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో నేరస్థులకు చట్టబద్ధపాలనను వర్తింపజేయాల్సిన అవసరం లేదని ఉద్భోదించటంద్వారా ఈ చర్యలను ప్రోత్సహిస్తున్నారు. ఒక రాష్ట్ర పాలకుడిగా ముఖ్యమంత్రి 'చట్టబద్ధపాలన' 'ప్రజాస్వామ్యం' అనేవి అభూత కల్పనలని స్పష్టం చేస్తున్నాడు.

1872లో కార్ల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్‌లు తమ ప్రసిద్ధ 'కమ్యూనిస్టు ప్రణాళిక'లో పేర్కొన్న అంశాన్ని ఈ సందర్భంలో ప్రస్తావించుకోవటం సముచితంగా వుంటుంది. కమ్యూనిస్టు ప్రణాళికలో వారు చట్టం, చట్టపాలనల వర్గ స్వభావాన్ని స్పష్టంగా వివరించి, "మీ న్యాయశాస్త్రం మీ(పాలకవర్గ) వర్గ ప్రయోజనాలు నెరవేర్చటంకోసమే రూపొందించి, దీనినే అందరి చట్టంగా పేర్కొంటారు" అని నొక్కి చెప్పారు.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ ప్రస్తుత పాలన– మార్క్స్, ఎంగెల్స్‌లు ఆనాడు పేర్కొన్నది ఎంతటి సబబుగావుందో రుజువు చేస్తోంది.

కనుక 'చట్టబద్ధపాలన' గురించి అది ప్రజాస్వామ్య సూత్రంగా వుంటుందనే దాని గురించి ఎవరికీ భ్రమలుండాల్సిన అవసరంలేదు. ఈ ఉన్నతాదర్శాలన్నీ సాధారణ ప్రజలను మోసగించి, పాలకవర్గాల పాలనకు వారిని లోబడే విధంగా చేయటానికి మాత్రమే.

ప్రభుత్వపాలనలో ఒక పార్శ్వం ఇలా వుండగా, ఉత్తరప్రదేశ్‌లో భ్రమాపూరిత చట్టబద్ధ పాలన యొక్క మరో పార్శ్వం కూడా వెల్లడైంది.

చట్టం ముందు అందరూ సమానులేనని, ప్రజాస్వామ్యంలో అందరికీ సమన్యాయం జరుగు తుందని పెద్దగా అరచి చెబుతుంటారు. కానీ, ఉత్తరప్రదేశ్‌లో బిజెపి రాష్ట్రప్రభుత్వం న్యాయ విశేషాధికారంపై నిరంకుశంగా స్వారీచేసే ప్రత్యేక సాధనంగా చట్టాన్ని మలిచింది.

ఆదిత్యనాథ్ ప్రభుత్వం 2013 నాటి ముజఫర్ నగర్, షామిలి మతతత్వ దాడులకు సంబంధించిన 131 కేసులనూ ఉపసంహరించుకునే క్రమాన్ని ప్రారంభించింది. ఈ దాడులలో ఆనాడు 62 మంది మరణించగా, 93 మంది గాయపడటంతోపాటు వేలాదిమంది విస్థాపనకు గురయ్యారు. మాజీ కేంద్రమంత్రి మరియు ముజఫర్‌నగర్ పార్లమెంటు సభ్యుడు అయిన సంజీవ్ బాల్యాన్ మరియు ఇతర ఎం.పీలు, ఎం.ఎల్.ఏలు, సీనియర్ రాజకీయ నాయకులపై వున్న కేసులే ఇవన్నీ. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారంతా హిందువులే కాగా, పెద్ద సంఖ్యలో బాధితులందరూ ముస్లిములే. దాడులతో సంబంధముందనే తప్పుడు ఆరోపణలపై ఈ కేసులన్నీ మోపబడ్డాయని చెప్పుకుంటూ, క్రిమినల్ కేసులను ఉపసంహరించుకునే తన నీచమైన చర్యను అధికారంలోనున్న బిజెపి సమర్థించు కుంటోంది.

మరోవైపున ఆదిత్యనాథ్ ప్రభుత్వం, న్యాయ స్థానాలలో అపరిష్కృతంగా వున్న కేసుల సంఖ్యను ప్రత్యేకించి రాజకీయ ఉద్దేశ్యాలతో పెట్టబడిన కేసుల సంఖ్యను తగ్గించేందుకు ప్రయత్నించటం తన లక్ష్యంగా ప్రకటించుకుంటోంది. తదనుగుణంగా రాష్ట్ర న్యాయపాలనాశాఖ జిల్లా న్యాయాధికారులకు ఓ లేఖద్వారా ప్రజాప్రయోజన కోణంతో కేసులను ఉపసంహరించుకోవాలని కోరింది.

ఈ విధంగా అధికారంలోనున్న బిజెపి తన రాజకీయ–మతపూరిత ఎజెండాను న్యాయవ్యవస్థపై రుద్దుతోంది. న్యాయవ్యవస్థ యొక్క ఈ మోసకారీతనమే, భారతదేశంలో పాలకవర్గాల చట్టబద్ధ పాలనగా పరిణమించింది.

ఉత్తరప్రదేశ్‌లో బిజెపి పాలనలోని రెండు పార్శ్వాలూ ప్రజాస్వామ్యం, చట్టబద్ధపాలనలనేవి భ్రమలని మరోమారు వెల్లడిచేశాయి; అలాగే తమ దోపిడీవర్గ ప్రయోజనాలను మరింతగా పెంపొందించుకునేందుకు పాలకవర్గాలు సాగించే పాలన తప్ప మరోటికాదని స్పష్టంచేశాయి.

ooooo